


'9 నుంచి జగనన్నకు చెబుదాం'

కలెక్టరేట్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమం మే 9 నుంచి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పిలతో ముఖ్యమంత్రి శుక్ర వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అత్యంత నాణ్యతతో సమస్యల పరిష్కారం కావాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమం పర్యవేక్షణ జరుగుతుందన్నారు. కాల్ సెంటర్‌కు 1902 టోల్ ఫ్రీ ఫోన్ నెంబరు పెట్టడం జరిగిందన్నారు. ప్రతి శని వారం గృహ నిర్మాణ దినోత్సవంగా నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జగనన్న భూరక్షా, భూ హక్కు, నాడు నేడు, జగనన్న విద్యా కానుక, తదితర అంశాలపై ముఖ్య మంత్రి సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పి విక్రాంత్ పాటిల్, ఇన్‌ఛార్జ్ జెసి సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, డిపిఒ బి.సత్యనారాయణ, హౌసింగ్ పీడీ పి.రఘురాం, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఓ. ప్రభాకర రావు, ఇన్ ఛార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ప్రజాపక్షమా... కార్పొరేట్ల పక్షమా?

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - బలిజిపేట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలు ప్రజల పక్షాన ఉన్నాయో, కార్పొరేట్ దోపిడీదారులకు రక్షణగా ఉన్నాయానని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రశ్నించారు. సిపిఎం ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ముగింపు సమావేశం బొడ్డాన భానుమూర్తి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సభలో వేణు మాట్లాడుతూ సిపిఎం-సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా బిజెపి హటావో దేశ్ కి బచావో అనే నినాదంతో ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి నుంచి ఈనెల 30 వరకు ప్రచారభేరి సభలు జరుగుతున్నాయన్నారు. బిజెపి అధికారానికి వచ్చి 9ఏళ్లు అవుతున్నా ఆ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు రైతులకు, కార్మికులకు, ప్రజలకు, దళిత, గిరిజన మహిళలకు ఎటువంటి ఉపయోగం లేదని అన్నారు. ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని, పైగా బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతంగా పెంచేశారన్నారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే పన్ను విధానంతో దేశ ప్రజలను ప్రభుత్వ సంస్థలను, ప్రకృతి సంపదను అదానీ, అంబానీ లాంటి కార్పొరేటు శక్తులకు ధారాదత్తం చేస్తుందని అన్నారు. ఎన్నికల ముందు నరేంద్ర మోడీ ఇచ్చిన హామీల్లో ఏదీ అమలు కాలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు, రామయ్యపట్నం పోర్టు నిర్మాణం, రాయలసీమ స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీలు తదితర విభజన హామీలు అమలు చేయలేదన్నారు. పోలవరానికి జాతీయ హోదా లేదని, నిధులు కూడా లేవని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కాకపోగా లక్షలాది మంది నిరుద్యోగులు, ఉద్యోగాలు లేక పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం రోడ్ల మీద తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేయడం లేదని, దళిత, గిరిజన మహిళలపై దాడులు, హత్యలు, అత్యా చారాలు జరుగుతున్నా వాటిపై స్పందించడం లేదని అన్నారు. మత ఘర్షణలు రేపుతూ దేశ లౌకిక తత్వాన్ని ఐక్యతను దెబ్బతీస్తుందని విమర్శించారు. బిజెపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి వైసిపి, టిడిపి, జనసేన మాట్లాడటం లేదన్నారు. కావున ప్రజలంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై.మన్మధరావు. పాలీల అప్పారావు, బలరాంనాయుడు, త్రినాధ రావు, వెంకటస్వామి, నల్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

3న సిఎం పర్యటన ఖరారు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విజయనగరం జిల్లా పర్యటన ఖరారైంది. భోగాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డు ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఈనెల 3న శంకుస్థాపన చేయను న్నారు. ఆరోజు ఉదయం 9.20 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడ 9.30గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి భోగాపురం మండలం రావివలసకు 10గంటలకు చేరుకుంటారు. హెలీప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు స్వాగతం పలకనున్నారు. అనంతరం అక్కడి నుంచి 10.15గంటలకు జిఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు చేరుకొని పరిశీలిస్తారు. 10.30 గంటలనుంచి 10.55 వరకు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి, చింతపల్లి ఫ్లోటింగ్ జెట్టీ, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు బ్యాలెన్సు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 10.55గంటలకు సవరవిల్లిలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. 11 గంటల నుంచి 12.20గంటల వరకు సభలో ఉంటారు. 12.30 నుంచి 1.15 గంటల వరకు స్థానిక నాయకులతో మాట్లాడుతారు. 1.20గంటలకు సవరవిల్లి నుంచి ఎ.రావివలస చేరుకొని విశాఖ వెళ్తారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.


సర్వే రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బలిజిపేట

రీసర్వేలో భాగంగా రాళ్ల ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జగనన్న భూ రక్షా, భూ హక్కు (రీసర్వే)లో భాగంగా మండలంలోని మిర్తివలస, జనార్ధనపురం గ్రామాల్లో సర్వే రాళ్ల (స్టోన్ ప్లాంటేషన్) ఏర్పాటును శుక్రవారం తనిఖీ చేశారు. త్వరితగతిన సర్వే రాళ్ల ఏర్పాటు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే మరో విడత కార్యక్రమం త్వరలో ప్రారంభం కానుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకూ పూర్తయిన భూములకు సర్వే రాళ్ల వేగవంతం చేసి మే 15 నాటికి శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు రైతుల సహకారం కూడా అవసరం మేరకు తీసుకోవాలని ఆయన సూచించారు. రీ సర్వే ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంగతిని గుర్తు చేస్తూ వంద సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ గర్వంగా భావించాలని అన్నారు. గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం, దాన్ని పక్కాగా అమలు చేసి అందుకు మరింత వన్నె తేవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిల్లాడ రత్నకుమారి, ఎస్ఐ ఎన్.ప్రశాంత్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలోని పాఠశాలల్లో నాడు-నేడు కింద మంజూరైన పనులను పాఠశాలల పునః ప్రారంభంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి విద్యాశాఖ అధికారులతో నాడు నేడు పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు కింద మంజూరైన ఆధునీకరణ, మరమ్మతుల పనులు పాఠశాలలు తెరుచుకొనే నాటికి పూర్తి కావాల్సిందేనన్నారు. పెండింగ్లో ఉన్నట్లయితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పాఠశాలలో గాలీ, వెలుతురుతో పాటు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ పంపిణీ చేయాలన్నారు. దీనికి ప్రధానోపాధ్యాయులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. వేసవి సెలవుల్లో వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో వాట్స్ అప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి విజ్ఞానాన్ని పెంపొందించాలని సూచించారు. గ్రంథాలయ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకొనేలా ప్రేరణ కల్పించాలని అన్నారు. పదో తరగతి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. నైట్ వాచ్‌మన్ నియామకాల్లో పాఠశాల ఆయాగా పనిచేస్తున్న భర్తలకు తొలి ప్రాధాన్యత నివ్వాలని, నెలాఖరులోగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇంచార్జి జెసి విష్ణు చరణ్, ఇన్‌ఛార్జి డిఇఒ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి ఓ.ప్రభాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్ల ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

హోటళ్ల ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం ఒక ప్రకటన విడుదల చేశారు. హోటల్స్, లాడ్జీలు, రెస్టారెంట్లు, వెల్నెస్ సెంటర్లు, ట్రావెల్ ఆపరేటర్లు అంతా ట్రేడ్ రిజిస్ట్రేషను చేసుకోవాలని పర్యాటకశాఖ ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ట్రేడ్ రిజిస్ట్రేషను చేయించుకుంటే రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్‌తో పాటు, కేంద్ర ప్రభుత్వ సాతి-నిధి ఇవ్వడం జరుగుతుందని, ఈ సర్టిఫికెట్ పొందిన వారికి పర్యాటక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్స్, లాడ్జిలు, గెస్ట్ హౌస్‌లకు రూ.300, హోం స్టేలు, ఫాం స్టేలకు రూ.200, టూర్ బోటు ఆపరేటర్లు, ఎడ్వంచర్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్లకు రూ.500, వెల్నెస్ సెంటర్లు, కన్వెన్షన్ హాలు, సర్వీస్ అపార్టుమెంట్లకు రూ.500 ప్రకారం www.aptourism.gov.in వెబ్ సైటు ద్వారా రిజిస్ట్రేషను చేసుకోవాలని, పూర్తి వివరాలకు జిల్లా పర్యాటక అధికారి ఫోన్ 6309942033, 8919168306 నంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

కార్యదర్శికి షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని హుస్సేన్ పురం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం పాలకొండ డిఎల్‌డిఒ వి.గోపాలకృష్ణ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సచివాలయ కార్యదర్శి షణ్ముఖరావు పనితీరు బాగోలేదని, విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో పాటు పివిటిజి సర్వేలో కూడా వెనుకబడి ఉన్నట్లు గుర్తించి షో కాజు నోటీసిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఢీ అంటే ఢీ

రసాభాసగా కౌన్సిల్ సమావేశం


సమావేశంలో బాహాబాహీకి దిగుతున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-పాలకొండ, పాలకొండ రూరల్

నగర పంచాయతీ సాధారణ సమావేశం శుక్రవారం ఢీ అంటే ఢీ అన్న రీతిలో జరిగింది. కౌన్సిలర్లు రెండు గ్రూపులుగా మారి ఘర్షణకు దిగారు. ప్రతి నెలా ప్రజాసమస్యలపై చర్చించేందుకు వేదికగా ఉన్న ఈ సమావేశం కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలకు వేదికగా మారింది. నువ్వెంతంటే నువ్వెంత అన్న రీతిలో కౌన్సిలర్లు ఎదురుతిరిగారు. కుర్చీలు తోసుకునే స్థాయికి చేరింది. ఒకరిపై ఒకరు ఆగ్రహావేశాలతో కౌన్సిలర్లు రెచ్చిపోయారు. నగర పంచాయతీ వైస్‌చైర్మన్ రౌతు హనుమంతురావు అధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది. తొలుత 13వ వార్డు కౌన్సిలర్ భాసూరు కాంతారావు మాట్లాడుతూ తమ వార్డులో రోడ్డు పనులు జరగడం లేదని పూర్తిగా పట్టించుకోవడం లేదని తమ వార్డు అభివృద్ధిని గాలికి వదిలేశారని అధికారులను ఆయన నిలదీశారు. దీనిపై మరో కౌన్సిలర్ కొంచాడ అరుణ్ స్పందిస్తూ పనులు చేయొద్దని మీ కుటుంబ సభ్యులే చెబుతున్నారని దగ్గరుండి పనులు చేసేందుకు కౌన్సిలర్ సహకరించకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. దీంతో 13వ వార్డు కౌన్సిలర్ కాంతారావు మాట్లాడుతూ ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయొద్దని తామంతా అభివృద్ధి పనులు చేయాలని కోరుతున్నామని అరుణ్‌పైకి ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై మరో కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు స్పందిస్తూ సమావేశాల్లో ఆవేశం పనికిరాదని, నెమ్మదిగా మాట్లాడాలని చెప్పడంతో కాంతారావు, పాపినాయుడు మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. నువ్వెంతంటే నువ్వెంత అన్న స్థాయిలో వాగ్వివాదానికి దిగారు. కొద్దిసేపు సమావేశంలో గందరగోళం చోటుచేసుకుంది. కాంట్రాక్టర్‌ను ఇక్కడకు రప్పించాలని పట్టుపట్టారు. కమిషనర్ సర్వేశ్వరరావు తీరును కూడా కౌన్సిలర్లు ఎండగట్టారు. దీంతో ఎంఎల్‌ఎ సమావేశానికి హాజరై సర్ది చెప్పారు. కౌన్సిల్‌లో సభ్యులను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారిని పక్కనపెట్టి పనులు చేపట్టరాదని అధికారులను మందలించారు. దీంతో సమావేశానికి హాజరైన ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్‌ను కూడా కౌన్సిలర్ భాసూరు కాంతారావు నిలదీశారు. తమ వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని, ఏకగ్రీవంగా గెలిచానని అయినా తనను పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఇలా సమావేశాల్లో రాద్ధాంతరం చేస్తే సమస్యలు పరిష్కారం కావని, తన ఇంటికి వచ్చి కూర్చొని పరిష్కరించుకుంటే మంచిదని ఎమ్మెల్సీ అన్నారు. పత్రికల్లోకి ఎక్కి పరువును బజారులోకి ఈడ్చుకుండా ఉండాలని సుతిమెత్తగా మందలించారు. వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

30న డెప్యుటేషన్లు రద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

పని సర్దుబాటు పేరుతో వేసిన డెప్యుటేషన్లు అన్నీ ఈనెల 30న రద్దవుతాయని, ఉపాధ్యాయుల సొంత స్థానాలకు రిలీవ్ కావాలంటూ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు తెలిపారు. ఈ ఉత్తర్వులు అమలు చేసేందుకు ఆర్‌జెడిలు డిఇఒలకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అలాగే రూ.2,500తో ప్రమోషన్ల ద్వారా పని చేస్తున్న ఉపాధ్యాయులను, కన్వర్షన్‌లో జాయిన్ అయిన ఉపాధ్యాయులు మాత్రం రిలీవ్ అవ్వకూడదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను అమలు చేస్తూ డెప్యుటేషన్లన్నింటినీ రద్దు కోరుతూ ఉత్తర్వులను ఎంఇఒ, హెచ్‌ఎంలకు ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు కోరారు.


సిఎం కప్ హాకీ టోర్నమెంట్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

సిఎం కప్ హాకీకి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఎస్.లక్ష్మి, ఎస్.అనూష, ఎస్.రమణి ఎంపికయ్యారు. ఈనెల ఈనెల 29 నుంచి మే వరకు జరుగు ఈ టోర్నమెంట్ కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జీవనజ్యోతి తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది అభినందించారు. జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

సచివాలయానికి కరెంటు కట్

- బిల్లు చెల్లించని పంచాయతీలు
- సేవలకు అంతరాయం
- ఐదు రోజులుగా అవస్థలు


విద్యుత్ లేక బోసిపోయిన సచివాలయం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎస్.పెద్దవలస, నంద పంచాయతీలకు సంబంధించిన సచివాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో గత ఐదు రోజులుగా సేవలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే విద్యుత్ బకాయి పేరుకుపోవడంతో విద్యుత్ శాఖ సరఫరాను నిలిపివేసింది. సోమవారం నుండి శుక్రవారం వరకు సచివాలయానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. సిబ్బంది కూడా అవస్థలు పడుతూ విధులను ల్యాప్‌టాప్‌ల ద్వారా వేరొక ప్రాంతానికి పోయి సేవలందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో పలుమార్లు విద్యుత్ బకాలు చెల్లించాలని ఇరు పంచాయతీలకు నోటీసులిచ్చినా ఫలితం లేకపోవడంతో విద్యుత్ సిబ్బంది సరఫరా నిలిపివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించి, సకాలంలో సేవలు అందేలా చర్యలు చేపట్టాలని నంద, ఎస్ పెద్దవలస పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

60వేల మెట్రిక్ టన్నుల బియ్యం సిద్ధం చేయండి

ప్రజాశక్తి - సీతంపేట


మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్ఒ, డిఎం

జిల్లాలో మే 15 కల్లా మిల్లర్ల ద్వారా 60 వేలు మెట్రిక్ టన్నులు సిఎంఆర్ (కష్టం మిల్ట్ రైస్) పంపిణీకి సిద్ధం చేయాలని జిల్లా సివిల్ సప్లై అధికారి కెవిఎల్ఎన్ మూర్తి, సివిల్ సప్లై డిఎం ఎండి నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక సివిల్ సప్లై గోదాం వద్ద సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం పరిధిలో గల మిల్లర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు లక్షల 31 మెట్రిక్ టన్నులకు రూ.470 కోట్లు రైతులకు చెల్లించామని తెలిపారు. గోనులు, కూలీలు, హామీల రవాణా ఛార్జీల కింద రూ.పది కోట్లు చెల్లించామని, ఇంకా రూ.2.5 కోట్లు చెల్లించాల్సి ఉందని అన్నారు. ఖరీఫ్‌లో మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రబీకి 6 వేల మెట్రిక్ టన్నుల దాన్యా కొనుగోలుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లై డిటి మధుసూదన్ రావు, గోదాం డిటి శ్రీనివాసరావు, గోదాం ఇంచార్జ్ కన్నబాబు, మిల్లర్స్ సంఘం అధ్యక్షులు కొత్తకోట రమేష్, కార్యదర్శి టీవీ రమణ, మిల్లర్లు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు, పలు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - సీతంపేట

కార్మిక హక్కుల దినమైన మేడేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రమణారావు మాట్లాడుతూ ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు తీవ్రంగా అమలవుతున్న నేపథ్యంలో పోరాడి సాధించుకున్న హక్కులపై పాలకవర్గాలు దాడి చేస్తున్నాయని సమ్మె యూనియన్ ఏర్పాటు ఉమ్మడి బేరసారాలు, వేతనాలు సామాజిక భద్రతల హక్కులు కుదించబడుతున్నాయని, అన్నారు. 8గంటల పని దినం కోసం జరిగిన కార్మిక పోరాటం మేడేగా ప్రసిద్ధికెక్కిందని, ఆ తర్వాత కాలంలోనే ప్రపంచంలోని అన్ని దేశాల్లో కార్మికవర్గం 8 గంటల పని దినాలు సాధించిందని, పని గంటలు కాకుండా ఇతర హక్కులను కూడా సంపాదించుకుందని చెప్పారు. నేడు కార్మిక హక్కులు నిలుపుకునేందుకు మరో పోరాటం చేస్తుందని, అందుకనే మేడే దినోత్సవం కార్మిక హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నేటి నుంచి వారోత్సవాలుగా జరగాలని, జెండా ఆవిష్కరణలు, ఊరేగింపులు, సభలు అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీతంపేట మండల కమిటీ అధ్యక్షులు ఎస్.సురేషు, కార్యదర్శి ఎం.కాంతారావు, వివిధ సంఘాల నాయకులు ఎన్.రోయిబారి, ఎ.దరిశమి, బి.పార్వతి, ఉష, అరుణ్ కుమారి, ప్రియ, రవణమ్మ పాల్గొన్నారు.

కొమరాడ : మే 1న మండల కేంద్రంలో జరిగే జెండా ఆవిష్కరణకు కార్మికులు వచ్చి జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మండలం కోనేరు రాంభద్రపురం పిహెచ్‌సి వద్ద విలేకరులతో మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లతో కలిసి మే 1న కొమరాడలో జెండా ఆవిష్కరణ జరుగుతుందని, కావున కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆశా, సిహెచ్‌డబ్ల్యు సంగ నాయకులు లక్ష్మి, ఉజాత, వెంకటలక్ష్మి, మంగమ్మ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సహాయకుల పోస్టులు భర్తీ

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలోని పలు ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో ఏర్పడిన 3 అంగన్వాడీ కార్యకర్తలు, 9 సహాయకురాలు పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె.విజయగౌరి తెలిపారు. అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థినులు దరఖాస్తులను ఈనెల 29నుంచి మే 6 సాయంత్రం 5గంటల్లోపు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి అందజేయాల్సిందిగా తెలిపారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం తర్వాత తెలియజేస్తానని, భర్తీ నియమ నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుదారులు మాత్రమే ఇంటర్వ్యూకు పిలవనున్నట్టు తెలిపారు. పాలకొండ మున్సిపాల్టీ ప్రాజెక్టు పరిధిలో 2 అంగన్వాడీ కార్యకర్తలు, 3 అంగన్వాడీ సహాయకురాలు, పార్వతీపురం మున్సిపాలిటీ ప్రాజెక్టు పరిధిలో 1అంగన్వాడీ సహాయకురాలు, బొబ్బిలి రూరల్ ప్రోజెక్టు (సీతానగరం, బలిజపేట మండలం) పరిధిలో 1 అంగన్వాడీ కార్యకర్త, 5 అంగన్వాడీ సహాయకురాలు పోస్టులను భర్తీ చేసేందుకు పదో తరగతి పాసయిన 21-35 ఏళ్ల వయస్సు గల స్థానిక నివాసం కలిగిన వివాహిత మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించినట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను సంబంధిత ప్రాజెక్టు కార్యాలయంలో సంబంధిత ఐసిడిఎస్ కార్యాలయంలో తీసుకొని, పూర్తిచేసిన దరఖాస్తులను అందజేసి రశీదును పొందాల్సిందిగా తెలిపారు.

మాత, శిశు మరణాల నివారణే లక్ష్యం

డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్

మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్లు, సిడిపిఒలకు నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణీగా నమోదైనప్పటి నుంచి ప్రసవమయ్యేంత వరకు అన్ని వైద్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు సక్రమంగా జరిగేలా పూర్తి స్థాయిలో ఆరోగ్య పర్యవేక్షణ చేపట్టాలన్నారు. గర్భిణీలను త్వరితగతిన గుర్తించి నమోదు చేయాలని, అందుకు అవసరమైన పరీక్షల కిట్లు అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది వద్ద అందుబాటులో ఉండాలని అన్నారు. తద్వారా హై రిస్క్ గర్భిణులను త్వరగా గుర్తించి అందుకు కారణమైన నివారణ చర్యలు వెంటనే చేపట్టి పర్యవేక్షణ చేయాలన్నారు. రక్తహీనత గుర్తించిన గర్భిణీలకు హీమోగ్లోబిన్ శాతం సాధారణ స్థితికి చేరే వరకు అవసరమైన చర్యలు చేపట్టాలని, వివరాలను ఎప్పటికప్పుడు మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేయాలన్నారు. గిరి శిఖర గ్రామాలు, రవాణా సదుపాయం లేని ప్రాంతాల్లో గర్భిణులను, హైరిస్క్ గర్భిణులను ముందస్తుగానే బర్త్ ప్లానింగ్ చేసి, ప్రసవానికి వారానికి ముందుగానే సంబంధిత రిఫరల్ ఆసుపత్రి, గర్భిణీల వసతి కేంద్రాల్లో చేర్చాలని చేయాలని సూచించారు. బాలింత, శిశు ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టాలని, నవజాత శిశువులను తరుచు పర్యవేక్షణ చేసి శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు గుర్తించడం, బిడ్డ తల్లిపాలు సరిగ్గా తీసుకుంటున్నదీ లేనిదీ, బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన చికిత్స వెంటనే అందజేస్తామని, మూఢ నమ్మకాలపై అవగాహన తదితర చర్యల ద్వారా శిశు మరణాలను తగ్గించవచ్చని సూచించారు. ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందజేస్తున్న పోషకాహారం ఆవశ్యకతను వారికి వివరించాలని, రక్తహీనత నివారణకు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ జివి రమణ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నిర్వాసితుల కాలనీలో సిపిఎం నాయకుల పర్యటన

కలెక్టరేట్: రైల్వే మూడో లైన్ విస్తరణలో భాగంగా పార్వతీపురం పట్టణంలోని విజయరామరాజు కాలనీలో ఇళ్లను సిపిఎం నాయకులు బంటు దాసు, వి.ఇందిర, జి.వెంకటరమణ, పట్టణ సూరిబాబు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే నిర్వాసితులు మాట్లాడుతూ తామంతా పట్టణంలోని విజయరామరాజు కాలనీలో ఎన్నోఏళ్లుగా నివసిస్తున్నామని, రైల్వే మూడో లైను విస్తరణ పనుల్లో భాగంగా తమ ఇళ్లను కూల్చివేయొద్దని, ఈ పనుల వల్ల సుమారు 80 కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ అందరికీ పునరావాసం కల్పించి పునర్నిర్మాణం జరిగేలా న్యాయం చేయాలని కోరారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడుతూ రైల్వే విస్తరణ పనుల్లో ఆవాసం కోల్పోయిన కుటుం బాలందరికీ న్యాయం జరిగే వరకూ సిపిఎం పోరాడుతుందని హామీ ఇచ్చారు.

నగేష్ రెడ్డికి అంబేద్కర్ జాతీయ సేవారత్న పురస్కారం


నగేష్‌రెడ్డిని సన్మానిస్తున్న భాస్కరరావు

కురుపాం: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళా పరిషత్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ శతజయంత్సోవాల సందర్భంగా నియోజకవర్గ కంటి వైద్య నిపుణులు జీరు నగేష్‌రెడ్డికి జాతీయ సేవా రత్న పురస్కారాన్ని గురువారం రాత్రి విశాఖ జిల్లాపౌర గ్రంథాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు కళా భూషణ డాక్టర్ పిఎ భాస్కరరావు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన, లోతట్టు ప్రాంతాల్లో అనేక నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి ఎందరో అభాగ్యులకు చూపును మెరుగు పరిచేందుకు తోడ్పాటు వల్ల ఆయన సేవలను గుర్తించి అవార్డు అందిస్తున్నట్లు తెలిపారు. ఈయన అవార్డు రావడం పట్ల తోటి ఉద్యోగులు అభినందించారు .

ఆర్మీ జవాన్ కుటుంబాన్ని పరామర్శ

పాలకొండ రూరల్ : మండలంలోని అవలంగిలో నగరపు దుర్గారావు కుమారుడు నగరపు అరుణ్ కుమార్ ఆర్మీ జవాన్ అకాల మరణం చెందారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ నిమ్మక జయక్రిష్ణ శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, కోట ఆదినారాయణనాయుడు, కోట సంగంనాయుడు, కరణం వరహాలు నాయుడు, తదితరులున్నారు.

రికార్డులు అప్‌డేట్ చేయాలి

వీరఘట్టం : రికార్డులను తప్పనిసరిగా అప్డేట్ చేయాలని పాలకొండ డిఎల్‌డిఒ వి.గోపాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కత్తులకవిటి సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాల డిస్‌ప్లే కాపీలను బోర్డులో వేలాడదీయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. విధి నిర్వహణ అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎంపిడిఒ వై.వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సత్యం

నేటి విద్యార్థులే రేపటి ఉద్యోగులు

సీతంపేట : నేటి విద్యార్థులే రేపటి ఉద్యోగులని ఎంపిడిఒ కొండపల్లి సత్యం అన్నారు. మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కర్నీ పాఠశాలలో చేర్పించాలని, దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని అన్నారు. ఎంఇఒ ఎం.ఆనందరావు మాట్లాడుతూ విద్యార్థులకు మూలధనం విద్య అని అన్నారు. సర్పంచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ రాబోయే వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండలకు గురికాకుండా తమ పిల్లలకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యనాయుడు మాట్లాడుతూ విద్యార్థులను వేసవి సెలవుల్లో చెరువులు, నదులు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి వద్ద చదివించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సవర ప్రసాదు, విద్యా కమిటీ చైర్మన్ ఆరిక కళావతి, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పాలక కృష్ణారావు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

పాలకొండ రూరల్ : మండలంలోని కొండాపురంలో గ్రామ దేవత పండగల సందర్భంగా గ్రామంలో ఉద్యోగులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. విజేతలకు గ్రామ పెద్దల సమక్షంలో బహుమతులు అందజేశారు.


నారా లోకేష్‌కు సమస్యలను వివరిస్తున్న రంజిత్‌కుమార్

యువగళం పాదయాత్రలో రంజిత్ కుమార్

కురుపాం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో టిడిపి తెలుగు యువత అధికార ప్రతినిధి, స్థానిక నాయకులు కోలా రంజిత్ కుమార్ శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో జరుగుతున్న పాదయాత్రలో నారా లోకేష్‌తో కలిసి నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను తెలిపానని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

దేవనాపురంలో గడప గడపకు..

సీతంపేట : మండలంలోని దేవనాపురం సచివాలయం పరిధిలో జగతపల్లి, పక్కలజంతిలిగూడ, నాయుడు గూడ, దీసరగూడ, మధ్యగూడ, రామన్నగూడ, బూర్జగూడ, రుక్మిణీ గ్రామాల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి.కళావతి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జగతపల్లిలో రూ.3 లక్షల అంచనా విలువతో నిర్మితమైన రచ్చబండను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు ఎస్ రాము, మూటక రామారావు, నిమ్మక కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచి రోజులు రావాలి

పాలకొండ రూరల్ :రాష్ట్రానికి మంచి రోజులు రావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలో అవలంగి, జంపరకోట, డోలమడ గ్రామాల్లో శుక్రవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాలన సైకో పాలన అన్నారు. పూర్తిగా ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఇటువంటి దుర్మార్గమైన పాలనకు చమరగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, కోట సంగంనాయుడు, మీసాల శ్రీను, కరణం వరహాలనాయుడు తదితరులున్నారు.

వాహన రాకపోకలను అడ్డుకున్న యువత

ప్రజాశక్తి - పాచిపెంట

అధిక లోడుతున్న వాహనాల రాకపోకల వల్ల రోడ్లు పాడైపోతున్నాయని, దూమ్మూ, ధూళి వెదజల్లుతుందని, వెంటనే వాహనాల రాకపోకలను అరికట్టాలని పాచిపెంట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన పాచిపెంట మీదుగా గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులకు సామాగ్రి తెచ్చే లారీలు సామర్థ్యానికి మించి రాకపోకలతో ఇబ్బంది పడ్డాయని నిరసిస్తూ శుక్రవారం పాచిపెంట ప్రధాన రహదారి వద్ద వాహనాలను ఆపి సిఐటియు ఆధ్వర్యాన యువజన సంఘం నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘ నాయకులు మట్టపర్తి అశోక్, జరజాపు సూర్యం, ఎంపిపి పిన్నింటి ప్రసాద్ బాబు, టిడిపి సీనియర్ నాయకులు మట్టపర్తి సాయిబాబు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ పాచిపెంట ప్రధాన రహదారి సంబంధించి 15 టన్నుల నుంచి 20 టన్నుల వరకు బరువు గల వాహనాలు సామర్థ్యం గల వాహనాలు అంతకుమించి 50 టన్నుల నుంచి 60 టన్నుల సామర్థ్యం గల వాహనాలను గ్రీన్ ఫీల్డ్ రహదారి మెటీరియల్ నిరంతరం తీసుకువెళ్లడం వల్ల రోడ్లన్నీ పాడైపోయాయని తెలిపారు. అయినా అధికారులు చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారని అన్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రోడ్డు పరిస్థితిని బట్టి చిన్న వాహనాలకు అనుమతి కల్పించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా వాటరింగ్ చేసేలా చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం ఎస్ఐ ఎంవి రమణ మాట్లాడుతూ జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో యువకులు, మహిళలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న యువత

దానం చేయండి... ప్రాణం పోయండి

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రంలోని శ్రీ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల పిల్లలు ఒక పసి ప్రాణం కాపాడేందుకు మహోన్నతమైన కార్యక్రమాన్ని గత కొద్దిరోజులుగా నిర్వహిస్తున్నారు. చిన్నపిల్లలు అయినప్పటికీ తమతోటి ఐదేళ్ల పాప దీక్షితను బతికించేందుకు వారంతా కలిసి బలిజిపేట పురవీధుల్లోనూ, పలు గ్రామాల్లో దానం చేయండి... ప్రాణం పోయండి అంటూ డబ్బులు వసూళ్లు చేశారు. వివరాల్లోకి వెళ్లగా తెర్లాం మండలం బూరిపేటకు చెందిన టి.సాంబ, శివ కుమార్తె దీక్షిత (5)కు గుండెలో ఉన్న నాలుగు గదుల్లో రెండు గదుల రంధ్రాలు మూసుకుపోయి ఉండడంతో పాప ప్రాణానికే అపాయమని వైద్యులు తెలిపారు. దీంతో శ్రీభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో హాస్టల్ ట్యూటర్‌గా పనిచేసిన సాంబకు ఆ పాఠశాల పిల్లలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి పాప ఆరోగ్య పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. పాప వైజాగ్‌లో ఉన్న ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో రోజుకు సుమారు రూ.30వేలు నుంచి రూ.40వేల వరకు వచ్చే పరిస్థితి ఉందని వైద్యులు తెలిపారు. ఈ వైద్యానికి చాలామంది పెద్దలు ప్రజలు ఆర్థికంగా సహాయం చేస్తున్నారు. ఎవరైనా సహాయం చేయాలనుకుంటే 8008709541 నెంబర్ కు కాల్ చేసి సహాయం చేయగలరని వారు కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో తాగునీరు సమస్య పరిష్కరించాలని శుక్రవారం స్థానిక మున్సిపల్ మేనేజర్ రూబేను దిబ్బకు పట్టణ పౌర సంక్షేమ సంఘం, సిఐటియు నాయకులు పాకల సన్యాసిరావు, గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా పట్టణంలోని అన్ని వీధుల్లోనూ వారానికి ఒకసారి, పది రోజులకు రెండు మార్లు మాత్రమే కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా జరుగుతుందని, అది కూడా అరకొరగా ఇస్తున్నారని అన్నారు. దీంతో పాటు పట్టణంలో మున్సిపల్ బోర్లు కూడా సవ్యంగా పనిచేయడం లేదని, ప్రధాన మౌలిక సదుపాయాల్లో ముఖ్యమైన తాగునీరు ఇవ్వలేకపోవడం శోచనీయమని అన్నారు. పట్టణంలో మే 28, 29, 30 తేదీల్లో ఇప్పలపోలమ్మ, ఎర్రకంచెమ్మ, బంగారమ్మతల్లి గ్రామ దేవతల పండగలు జరగనున్నాయని, ఇందుకు లక్షలాదిమంది యాత్రికులు వస్తారని, ఇప్పుడే మంచినీళ్లకు ఇలా ఉంటే పండగ ఏం చేయాలోనని ప్రజల్లో ఆందోళన నెలకొందని అన్నారు. 70 శాతం మంది ప్రజలు కొళాయిల ద్వారా వచ్చే మంచినీటిపైనే ఆధారపడి నివసిస్తున్నారని, సక్రమంగా మంచినీళ్లు ఇవ్వ లేకపోతే ప్రజలంతా ఇబ్బందిపడే పరిస్థితి ఉందని అన్నారు. మంచినీళ్ల సమస్య పరిష్కరించకపోతే భవిష్యత్తులో ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు.

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - కొమరాడ

అకాల వర్షాలకు, గాలులకు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారమిచ్చి ఆదుకోవాలని సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కొమరాడలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, రైతుసంఘం నాయకులు మధుసూదనరావు, కె.మాధవరావు మాట్లాడుతూ మండలంలో గడిచిన కొన్ని రోజులుగా ప్రతిరోజు సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో పాటు భారీ గాలులు, వడగళ్ల వర్షం కురవడంతో కొమరాడ మాదిలింగి, వన్నాం, పాలెం, దళిపేట, నిమ్మలపాడు, తొడుము, కెమిశీల, కొట్టు, గుమడ, కుమ్మరగుంట, దుగ్గి, గుణానపురం, కల్లికోట, రాజ్యలక్ష్మీపురం, ఆర్తాం, విక్రమంపురంతో పాటు గిరిజన పంచాయితీలు నయా, పూడేశు, మసిమండ, పెద్దశాఖ, ఉరిపిరి, ఖేర్జల, చోళ్లపదం పంచాయతీల్లో మొక్కజొన్న, టమాటా, బొప్పాయి, అరటి, నూలు తదితర పంటలకు బాగా నష్టం జరిగిందన్నారు. కావున వెంటనే అధికారులు ఈ పంటలకు సంబంధించిన నష్టాన్ని గ్రామాల వారీగా గుర్తించి నష్టపరిహారం ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సందర్భంలో అటు వ్యవసాయ శాఖ, ఇటు రెవెన్యూ, ఉద్యానశాఖ అధికారులు నష్టాన్ని గుర్తించి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వామినాయుడు. సింహాచలం, పోల్నాయుడు, అప్పలనాయుడు, వెంకటినాయుడు, లక్ష్మునాయుడు, సాయిరాం పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న రైతులు, సిపిఎం నాయకులు


క్రికెట్ జట్లను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

మూలిగూడలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మూలిగూడలో మెగా యూత్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ క్రికెట్ పోటీలను సర్పంచ్ భర్త రామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, స్థానిక నాయకులు పాపారావు, భీమారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న స్థానిక పాఠశాల హెచ్ఎం సామల సింహాచలం మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన యువత క్రీడల్లో ఎంతో ప్రతిభ కలిగిన వారని, వీరికి ప్రభుత్వం సరైన శిక్షణ సౌకర్యాలు కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. ఒడిశా సరిహద్దులో ఉన్న గిరిజన గ్రామమైన మూలిగూడలో అంతర్ రాష్ట్ర యూత్ క్రికెట్ పోటీలను నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. మొదటి మ్యాచ్ కానసింగి, సురన్ని (ఒరిస్సా) జట్ల మధ్య జరగ్గా, సురన్ని జట్టు విజయం సాధించింది. అంపైర్లుగా రవి, సుందరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ టీచర్ ఎన్.సుధాకర్, నిర్వాహకులు ఎం.భాస్కరరావు, పి.చిన్నారావు, పి.విజయ్ కుమార్, పి.మణి, ఈశ్వర్, పలు క్రికెట్ జట్లు పాల్గొన్నాయి.

బ్యాంకు లింకేజీలు నూరుశాతం అమలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండలంలోని అన్ని మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీలు నూరు శాతం అమలయ్యేలా వెలుగు సిబ్బంది కృషి చేయాలని ఎపిఎం జి.సింహాచలం అన్నారు. మండల మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న లక్ష్యాలు ప్రతి మహిళా సంఘాల సభ్యుల నుంచి మహిళా మార్టు నిమిత్తం ఒక్కొక్క సభ్యురాలి నుంచి రూ.300 షేర్ ధనం వసూలు చేయాలని, ప్రతి సంఘానికి విధిగా అప్పులు వసూలు చేయించి, బ్యాంక్ లింకేజీలు చేయించాలని అన్నారు. అలా వాడిన నగదును ప్రతి సభ్యురాలు స్వతంత్రం జీవించడానికి సహరం అందేలా సహకారం అందించి వారి ఉన్నతికి సిబ్బంది పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిఎంజి సత్యనారాయణ, సిసిలు రామకృష్ణ, సుమతి, సంజీవ, బాలరాజు కృష్ణవేణి, విఒఎలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడి వలస గ్రామ జంక్షన్ శుక్రవారం ఎఎస్ఐ ఎల్లయ్య ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు నడిపిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెంట్ వేసుకోవాలని సూచించారు. ఈయనతో పాటు సిబ్బంది కూడా ఉన్నారు.

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి-పాలకొండ

ఈ నెల 29వ తేదీన స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద ఉదయం 11 గంటలకు వివిధ నేరాల్లో పట్టుబడిన 11 ద్విచక్రవాహనాలతో పాటు మూడు ఆటోలు, ఒక బొలేరా పికప్ వ్యాన్‌కు బహిరంగ వేలం వేస్తున్నట్టు ఎస్ఇబి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.గోపాల కృష్ణ తెలిపారు. ఆసక్తి గల వారు ఈ వేలంపాటకు హాజరుకావాలని కోరారు.

జోరుగా బోర్ల మరమ్మతులు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని 30 పంచాయతీల్లో గల 104 గ్రామాల్లో ఎటువంటి నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలుగా చేపట్టిన క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా బోరు బావులకు మరమ్మతులు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చిన్నబొండపల్లిలో గల బోర్లను సర్పంచి గండి శంకరరావు ఆధ్వర్యంలో మండల మెకానికులు బాబ్జీ, శ్రీనివాస్, రాజేష్ పనులు చేపట్టారు. నెలరోజుల పాటు మొబైల్ వాహనం ద్వారా అన్ని గ్రామాల్లోని బోర్ల నిర్వహణ పనులు చేపడతామని ఈ సందర్భంగా మెకానికుల బృందం తెలిపింది.


డోలీపై బాలింతను తీసుకొస్తున్న యువకులు

ఏజెన్సీలో తప్పని డోలి కష్టాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్ర్యం సిద్ధించి 75 దశాబ్దాలు గడిచినా మన్యం ప్రాంతంలో గిరిజనులకు వైద్య సేవలు అందని ద్రాక్ష గానే మారాయి. నేటికీ చాలా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం డోలి కష్టాలు తప్పడం లేదు. స్థానికంగా వైద్య సేవలు కరువవ్వడంతో కిలోమీటర్ల మేర కాలినడకన డోలి సాయంతో సమీపంలోని ఆస్పత్రులకు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఇందులో భాగంగానే మండలంలోని లుంబేసు పంచాయతీ దెరుగండలో పత్తిక చిరంజీవి భార్య సుశీల గర్భిణీ. ఈనెల 22న తీవ్ర నొప్పులు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఎటువంటి సదుపాయం లేక ఇంటి వద్దనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆరోగ్య పరీక్షల నిమిత్తం శుక్రవారం తల్లీబిడ్డను డోలి సాయంతో తాడికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలందించారు. ఏజెన్సీలో డోలి కష్టాలు నిత్యకృత్యంగా మారుతున్న అధికారులు, పాలకుల్లో మాత్రం చలనం ఉండడం లేదు. ఇప్పటికైనా గిరిజనల కష్టాలను గుర్తించి కొండలపైన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలి, భగంద్రవలస, తామరకండి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు చేస్తున్న పనులతో పాటు మస్తర్లను పరిశీలించారు. పనిలో ఉండే సంఖ్య మస్తర్ల సంఖ్యను పరిశీలించే నిర్దేశించిన సమయంలో కొలతలు ప్రకారం పనులు చేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వ నిర్ణయించిన ధర కూలిగిట్టుబాటు అవుతుందని అన్నారు. ఈ నెలలో జరుగుతున్న పనులు వడదెబ్బకు గురికాకుండా వేగంగా పనులు చేసుకుని చూడాలన్నారు. పని ప్రదేశాల్లో మంచినీరు సౌకర్యం ఉండాలన్నారు. ఆయనతో పాటు ఉపాధిహామీ ఇసి కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విఆర్ఎల సంఘం జిల్లా నాయకులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావుకు తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2018లో తమ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి నాలుగేళ్లయినా పరిష్కారం కాలేదన్నారు. అనేక దఫాలుగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. 2018లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన డిఎ రూ.300ను ప్రస్తుత ప్రభుత్వం రికవరీ పేరిట తిరిగి చెల్లించమనడం తమ శ్రమను దోచుకున్నట్లేనని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, డిఎ రికవరీ, జిఒను రద్దుచేసి డిఎతో కూడిన వేతనం ఇప్పించాలని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీసుకువెళ్లాలని స్థానిక ఎమ్మెల్యేను కలిసి వినతి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఎ జిల్లా అధ్యక్షులు గరుగుబిల్లి ఈశ్వరరావు, కార్యదర్శి, కృష్ణారావు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్, ఎస్.కృష్ణారావు, సుధ, ఎస్.శ్రీనివాసరావు, టి.నాగయ్య పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకున్న యువత

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల శివన్నపేటలో నివసిస్తున్న పెదపెంకి వెంకటరమణ ప్రైవేటు మాస్టర్‌గా పేరు పొంది తక్కువ ఫీజులకే విద్యార్థులకు పాఠాలు చెబుతూ కటిక బీదరికం అనుభవిస్తూ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక యువత ఎం.పృథ్వీరాజ్ కురుపాం వాట్సప్ గ్రూపులో ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి ఆదుకుందామని పిలుపును ఇచ్చారు. ఈ పిలుపునకు స్పందించి కురుపాం యువత రూ.22,000 వేలు నగదు, అతని వద్ద ప్రైవేట్ చదువుకున్న విద్యార్థులు రూ.11వేలు, మరియు నిత్యావసర సరుకులు పోగుచేసి ఆయన భార్యకు శుక్రవారం సాయంత్రం ఎస్సై సిహెచ్ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు యువత ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం పట్ల అభినందిస్తున్నారు. కార్యక్రమంలో బోటు మణి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్జలో గిరిజనుల నిరసన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనేతరులైన బోయ వాల్మీకులు, బెంతోరియాలను ఎస్టీల్లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని గిరిజన సంఘం, జెఎసి నాయకులతో మండలంలోని చిన్నగీశాడ పంచాయతీ గద్దర్జలో గిరిజనులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికే గిరిజనులకు ఉన్న హక్కులు, చట్టాలు సక్రమంగా అమలు కావడంలేదని ఈ నేపథ్యంలో బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చితే గిరిజనులకు మరింత నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్థానిక ఎమ్మెల్యే వ్యతిరేకించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు ఎం.వెంకటరావు, జెఎసి నాయకులు ఎన్.సింహాచలం, గ్రామస్తులు పాల్గొన్నారు.


పలుచోట్ల వైద్యసేవలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కొత్తవలసలో శుక్రవారం 104 అధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉషారాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిపి, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులు, వారికి వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు ఇస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు వైద్య సేవలందిస్తున్నామన్నారు. మంచానికి పరిమితమైన వారి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్య వివరాలు అడిగి, వారికి కావాల్సిన మందులు ఇస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత అప్పలనాయుడు, సూపర్వైజర్ సత్య వతి, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం :మండలంలోని విక్రంపురంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమా మహేశ్వరి 70మంది వరకు రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎం పైడితల్లి, ఎంఎల్‌హెచ్ పి.పవిత్ర, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.


కురుపాం : మండలంలోని వబ్బంగి గిరిజన గ్రామంలో 104 ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నిర్వహించారు. నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సమరసింహారెడ్డి 59 మందికి వైద్య సేవలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రజలకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పార్వతి హెల్త్ అసిస్టెంట్, జె.తిరుపతి, ఎఎన్ఎంలు మల్లేశ్వరి, శాంతి, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.


సీతానగరంలో మెడికల్ క్యాంపులో రోగుల పరీక్షిస్తున్న వైద్యులు

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - గరుగుబిల్లి



మండలంలోని నాగూరుకు చెందిన కుడుముల లక్ష్మం నాయుడు(70) పురుగుల మందు తాగి మృతి చెందాడు. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మనాయుడు బాధ భరించలేక గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు.

ముగ్గురిపై బైండోవర్ కేసులు

వీరఘట్టం: మండల కేంద్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై తహశీల్దారు సిహెచ్ సత్యనారాయణ బైండోవర్ కేసులు నమోదు చేశారు. నాటుసారా అక్రమ వ్యాపారం చేస్తుండగా, పాలకొండ ఎస్ఇబి అధికారులకు పట్టుబడ్డారని ఆయన తెలిపారు.